
జాలువారిన జలపాతం



తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు శేషాచలం కొండలపై నుంచి కపిలతీర్థం జలపాతం జాలువారుతోంది. చూపరులకు కనువిందు చేస్తోంది.
- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

క్లుప్తంగా

ఎమ్మెల్యే పెళ్లికానుక అందజేత



రామచంద్రాపురం: మండలంలోని కమ్మపల్లి పంచాయతీ దేశూరికండ్రిగ గ్రామంలో త్వరలో వివాహం చేసుకోనున్న వరుడు చంద్రశేఖర్ తల్లిదండ్రులు ఈశ్వరి, చెంచయ్యలకు పంచాయతీ కన్వీనర్ మహేంద్రరెడ్డి, పంచాయతీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చంద్రశేఖర్, హేమాద్రి సోమవారం పెళ్లికానుక అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తమ సొంత నిధులతో చంద్రగిరి నియోజకవర్గంలో వివాహం చేసుకోబోతున్న వధూవరులకు పట్టు వస్త్రాలు, బంగారు తాళిబొట్టు, మెట్టెలు, తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందిస్తున్నట్లు తెలిపారు.

హమాలీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ



ఎన్‌డీ.రవి, ఎ.బాబు

తిరుపతి కల్చరల్: హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీని సోమవారం ఎంపిక చేశారు. రెండు రోజులుగా గంధమనేని శివయ్య భవన్‌లో చేపట్టిన హమాలీ వర్కర్స్ యూనియన్ తిరుపతి జిల్లా మహాసభలు ఘనంగా ముగిశాయి. హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్‌డీ.రవి ప్రధాన కార్యదర్శిగా ఎ.బాబు, ఉపాధ్యక్షులుగా టి.సుబ్రమణ్యం, కె.నాగరాజు ఉదయ్‌కుమార్, సుదర్శన్, సహాయ కార్యదర్శులుగా మణి, సుధీర్, బాషా, కోశాధికారిగా ఎస్.సెంథిల్‌తో పాటు 9 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రతి వీధి లైట్ వెలగాల్సిందే...



స్పందన అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతి వీధి లైట్ వెలగాల్సిందేనని, అవసరమైన చోట్ల మరిన్ని వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమంలోఆమె అర్జీలను స్వీకరించారు. పూలవానిగుంట మైత్రీ అపార్ట్‌మెంట్ వద్ద వీధి లైట్లు వెలగడం లేదనే ఫిర్యాదుపై ఆమె స్పందించారు. ఫిర్యాదులు రాకుండా నిత్యం లైట్లు వెలుగుతున్నాయా లేదా అని పర్యవేక్షించాలన్నారు. రాఘవేంద్రనగర్, గాయత్రీ నగర్, డీఆర్ మహల్, చింతలచేను ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను కమిషనర్‌కు విన్నవించారు. ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, రెవెన్యూ అధికారులు కేఎల్ వర్మ, సేతుమాధవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్రరెడ్డి, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

విరిగిన చెట్టుకొమ్మల తొలగింపు



తుపాను కారణంగా 17వ డివిజన్ గాంధీపురంలో విద్యుత్ స్తంభాలపై విరిగిపడిన భారీ వృక్షాన్ని స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తొలగిస్తున్న వైఎస్ఆర్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు, స్థానిక నాయకులు - తిరుపతి మంగళం

ముంచెత్తిన... మిచాంగ్

- నగరంలో లోతట్టు ప్రాంతాల్లో ముమ్మరంగా సహాయక చర్యలు
- పునరావాస కేంద్రాలకు బాధితుల తరలింపు
- నేలకొరిగిన వృక్షాలు, నీట మునిగిన శివారు ప్రాంతాల్లో అప్రమత్తత
- పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం
- దెబ్బతిన్న గృహాలకు తక్షణ సాయం రూ.10వేలు
- బాధిత కుటుంబాలకు రూ.2500 ఆర్థిక సాయం
- యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టిన నగరపాలక సంస్థ
- నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికార యంత్రాంగం



సత్యనారాయణ పురంలో రోడ్లపై వరదలా పారుతున్న వర్షపు నీరు

తిరుపతి తుడా: తిరుపతి నగరాన్ని మిచాంగ్ తుపాను ముంచెత్తుతోంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడం లేదు. నగరపాలక సంస్థ అధికారులు ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటనలు చేసి సమస్య ఎదురైన ప్రతి చోట యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపడుతున్నారు. నగర పాలక సంస్థ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో లోతట్టు ప్రాంత ప్రజలను ముందే ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని సదుపాయాలను కల్పిస్తున్నారు. ఎస్టీవీ నగర్, గాంధీపురం, సత్యనారాయణ పురం, శివజ్యోతి నగర్, కట్టకిందపల్లి, ఆటో నగర్, కొర్లగుంట, చంద్రశేఖర్‌రెడ్డి కాలనీ, మాధవనగర్, లక్ష్మీపురం, కొరమేనుగుంటతోపాటు నగర శివారుల్లోని పలు కాలనీల్లో సహాయక చర్యలు ఊపందుకున్నాయి. సోమవారం ఉదయం నుంచి ఈదురు గాలులతో కురుస్తున్న వర్షాలకు రోడ్లు జలమయం అవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరిస్తున్నారు.

దెబ్బతిన్న గృహాలకు తక్షణ సాయం

తుపాను ప్రభావానికి దెబ్బతిన్న గృహాలకు తక్షణ సాయం కింద రూ.10 వేలును బాధితులకు అందించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో పాటు పునరావాస కేంద్రాలో ఆశ్రయం పొందుతున్న బాధితులకు ఇంటికి వెళ్లే సమయంలో వారి ముఖంలో సంతోషం చూడాలనే ఉద్దేశంతో ఒక వ్యక్తికి రూ.1000, కుటుంబానికి రూ.2500 ఆర్థిక సాయం అందించాలని సీఎం ఆదేశించారు. నగరంలో దెబ్బతిన్న గృహాలను పరిశీలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వార్డు సచివాలయ సిబ్బంది 24గంటలు సచివాలయంలో అందుబాటు ఉండి ప్రజల సమస్యలను తెలుసుకుని అధికారులకు సమాచారమిస్తున్నారు.

తుపాను సమయంలో అప్రమత్తత అవసరం

చంద్రగిరి: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపానుగా మారడంతో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఎంపీడీఓ బాలాజీ నాయక్‌తో కలసి మండల పరిధిలోని కల్యాణీ డ్యాంను పరిశీలించారు. అనంతరం ఏ.రంగంపేట, శ్రీనివాసమంగాపురం, మిట్టపాళెం, చంద్రగిరి, రాయలపురం, వెంకటంపేట గ్రామాల్లోని వాగులు, వంకలు, బ్రిడ్జిలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలకు వాగులు, వంకలు, చెరువులు నిండుకుండలను తలపిస్తున్నట్లు చెప్పారు. కల్యాణి డ్యాం పరిస్థితి నిలకడగా ఉందని, ప్రస్తుతానికి డ్యాం నీటిమట్టం 857 అడుగులు ఉన్నట్లు తెలిపారు. 877 అడుగులు వరకు నీళ్లు వస్తే గేట్ లెవెల్‌కు చేరుకుంటుందన్నారు. సర్పంచ్ వెంకటయ్య, పంచాయతీ ఈఓలు అనురాధ, మహేశ్వరయ్య, డివిజన్ అధ్యక్షుడు పసల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరులో...

తిరుచానూరు స్వర్ణముఖినదిలో పేరుకుపోయిన వ్యర్థాలు, పూడికతీత పనులను సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం శరవేగంగా చేపట్టారు. గతంలో వచ్చిన వరదలను దృష్టిలో పెట్టుకుని సర్పంచ్ రామచంద్రారెడ్డి ముందస్తు చర్యలను చేపట్టారు. గతంలోలా తీవ్ర ఆస్తినష్టం జరగకుండా చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సూచనలతో పూడికతీత పనులను ముమ్మరం చేసినట్లు ఆయన తెలిపారు.



ఆటోనగర్‌లో వీధుల్లో చేరిన వర్షపు నీరు



ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల అవస్థలు



శ్రీనివాస సేతు వద్ద వాహనదారుల కష్టాలు



నగరంలోని 21వార్డులో నేలకొరిగిన భారీ వృక్షం



తిరుచానూరు స్వర్ణముఖినదిలో జేసీబీలతో శరవేగంగా పూడికతీత పనులు



కరకంబాడి రోడ్డులో కాలువలోని వ్యర్థాలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు



చంద్రగిరిలో వర్షపు నీటిని పరిశీలిస్తున్న ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, ఎంపీడీఓ బాలాజీ నాయక్

చంద్రగిరిలో గాలీవాన బీభత్సం



భారీ వర్షంలోనూ విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న అధికారులు

చంద్రగిరి: మిచాంగ్ తుపాను తీవ్ర రూపం దాల్చడంతో సోమవారం సాయంత్రం నుంచి మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నారు. సాయంత్రం 7 గంటల నుంచి భారీవర్షంతోపాటు పెనుగాలులకు చెట్లు విరిగిపడ్డాయి. స్థానిక జాతీయ రహదారి వద్ద సాయంత్రం రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో పట్టణంలోని పాతపేటలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న విద్యుత్‌శాఖ అధికారులు ఆగమేఘాలపై ఘటనా స్థలానికి చేరుకున్నారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి, నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. 30 నిమిషాల వ్యవధితో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో చంద్రగిరివాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఏడీఈ శేషారెడ్డి, ఏఈఓలు నాగరాజు, హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

కిడ్నీ బాధితులకు అండగా జగనన్న సర్కారు



సెల్వంకు పింఛను అందజేస్తున్న సర్పంచ్ భాస్కర్‌రెడ్డి తదితరులు

చంద్రగిరి: కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న బాధితులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్కారు అండగా నిలుస్తోందని వైఎస్ఆర్ సీపీ ఐతేపల్లి డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అగరాల పంచాయతీకి చెందిన సెల్వంకు సీకేడీయూ పథకం కింద రూ.10 వేల పింఛను మంజూరు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డితో కలసి ఆయన పింఛను అందజేశారు. పింఛను అందుకున్న సెల్వం మాట్లాడుతూ సీఎం జగనన్నకు తన కుటుంబమంతా రుణపడి ఉంటుందని భావోద్వేగానికి గురవుతూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిరంజీవిరెడ్డి, అమ్ములు, రెడ్డప్పరెడ్డి, వెంకటముని, వెంకటేష్ పాల్గొన్నారు.

పశు శరీర నిర్మాణ శాస్త్రంపై జాతీయ సదస్సు



మీడియాతో మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతి రామయ్య, అధికారులు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ పశు శరీర నిర్మాణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జాతీయ సదస్సు జరగనున్నట్టు ఎస్వీ వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతి రామయ్య తెలిపారు. సోమవారం ఆయన వర్సిటీ అధికారులతో కలసి మీడియాతో మాట్లాడుతూ పశువుల పెంపకంలో ఆధునిక పద్ధతుల వినియోగం, ఆరోగ్యం, ఉత్పాదకత అను అంశాలపై మంగళవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి పశు నిర్మాణ శాస్త్రవేత్తలు, పరిశోధకులు హాజరవుతారన్నారు. వర్సిటీ వీసీ, స్విమ్స్ డైరెక్టర్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవులు మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఆవులు

తిరుచానూరు(చంద్రగిరి): విద్యుత్ షాక్‌కు గురై ఆవులు మృతి చెందిన ఘటన తిరుచానూరు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి సమీపంలోని అన్నదాన సత్రం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు రెండు ఆవులు వెళ్లాయి. అక్కడున్న చెత్తను మేసే క్రమంలో ఆవులకు ఎర్త్ వైరు తగలడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడే కుప్పకూలిపోయాయి. కాసేపటికి గమనించిన స్థానికులు చూడగా అప్పటికే చెందినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన విద్యుత్ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

చందనాలంకరణలో సర్వేశ్వరుడు



చందన అలంకరణలో శ్రీఅగస్త్యేశ్వరస్వామి వారు, ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చంద్రగిరి: కార్తీక మాసం సందర్భంగా సోమవారం మండల పరిధిలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. మండల పరిధిలోని తొండవాడ స్వర్ణముఖీనది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి(ముక్కోటి) ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారిని చందనం అలంకరణలో సుందరంగా అలంకరించారు. భక్తులు ఉదయం ఆలయం వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్తీక దీపాలతో భక్తుల సందడి

భాకరాపేట: కార్తీక మాసం పురస్కరించుకుని కార్తీక సోమవారం చిన్నగొట్టిగల్లులోని శ్రీభీమేశ్వర స్వామి ఆలయంలో దీపాలతో భక్తుల సందడి నెలకొంది. సాయంత్రం నుంచి ఆలయ మూల విరాట్ నుంచి ధ్వజ స్తంభంపై కార్తీక దీపం వరకు దీపాలు పెద్ద ఎత్తున వెలిగించి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

అమావాస్య నోములు

దీపావళి అమావాస్య నోములు నోముకొనే భక్తులు సోమవారం ఉదయం నుండి పెద్ద ఎత్తున ఆలయంలో నోములు నోచుకుని నోము దారాన్ని ధరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు చిన్నారి స్వామి నోముల వ్రత విశిష్టతను భక్తులకు వినిపించారు.



నోములు నోచుకుంటున్న భక్తులు

దళితులపై దౌర్జన్యాలు దారుణం



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న మొరవపల్లి దళితవాసులు

చంద్రగిరి: మండల పరిధిలోని మొరవపల్లి దళితులు పూరిగుడిసెలకు విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేసుకుంటుంటే అగ్రవర్ణాలకు చెందిన కొంత మంది దౌర్జన్యానికి పాల్పడడం దారుణమని దళిత నాయకులు మండిపడ్డారు. వారి దౌర్జన్యానికి నిరసనగా సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ఎం.కొత్తపల్లి లెక్క దాఖలా సర్వే నెంబర్ 771-1/4లో 2 ఎకరాల 84 సెంట్లు భూమి ఉందని దళితులు తెలిపారు. అందులో నేషనల్ హైవేకు 65 సెంట్లు పోయిందని మిగిలిన భూమిలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నామని చెప్పారు. కొంతకాలంగా గుడిసెలకు విద్యుత్, నీటి కుళాయిలు కావాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని కలిస్తే ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. మీటర్లు ఏర్పాటు చేయడానికి విద్యుత్ శాఖ అధికారులు వస్తే వారిని అగ్రకులాలకు చెందిన పక్క భూముల రైతులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దళితులపై దౌర్జన్యానికి దిగుతున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి న్యాయం చేయాలని తహశీల్దార్ శిరీషకు, సీఐ రాజశేఖర్‌కు, ఏఈ హరికి వినతిపత్రాలు సమర్పించారు.

ఎలుగుబంటి దాడిలో గాయపడ్డ వ్యక్తికి పరామర్శ

- మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు విజ్ఞప్తి చేసిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



రాజు ఆరోగ్య పరిస్థితిపై వైద్యాధికారుల వద్ద ఆరా తీస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి: కల్‌రోడ్డుపల్లి సమీపంలోని ఆముదాల కోనకు చెందిన రాజుపై ఎలుగుబంటి దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. రెండు రోజుల క్రితం గ్రామానికి ఆనుకుని ఉన్న అడవికి మేకలను మేతకు తీసుకు వెళ్లగా అదే సమయంలో ఎలుగుబంటి అతనిపై దాడి చేయడంతో తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబీకులు తిరుపతి నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా శస్త్ర చికిత్సలు చేసి ఐసీయూలో వైద్యం అందిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సోమవారం ఆసుపత్రికి వెళ్లి గాయపడ్డ వ్యక్తిని పరామర్శించారు. గాయపడ్డ వ్యక్తి కుమారుడు ప్రకాష్ ఐతేపల్లి ఎమ్మెల్యే కార్యాలయంలో ఏపీఆర్‌ఓగా పనిచేస్తున్నాడు. మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులకు సూచించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట పార్టీ డివిజన్ అధ్యక్షుడు దేవారెడ్డి, అగరాల సర్పంచ్ భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

ఘంటసాల గానం అజరామరం



ఘంటసాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తదితరులు

తిరుపతి కల్చరల్: ఘంటసాల గానం, స్వరం అజరామరం అని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి కొనియాడారు. ఘంటసాల వెంకటేశ్వరరావు 101వ జయంతిని పురస్కరించుకొని తిరుపతి ఫిలిం సొసైటీ, రాయలసీమ రంగస్థలి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం వీవీ మహల్ రోడ్డు సర్కిల్లోని ఘంటసాల విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం హాజరై ఘంటసాలకు నివాళులు సమర్పించారు. తిరుపతి ఫిలిం సొసైటీ కార్యదర్శి సీఆర్‌కే శేషగిరిరావు మాట్లాడుతూ తిరుమల శ్రీవారి భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన శ్రీనివాస సేతుపై ఉదయం వేళ శ్రీవారి కోసం ఘంటసాల ఆలపించిన సుప్రభాతం గీతాన్ని వినిపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతి ఫిలిం సొసైటీ కోశాధికారి ప్రసాద్‌రావు, సభ్యులు ఆర్.సుబ్రమణ్యం, భాస్కర్, అనసూయమ్మ, శ్రీకాళహస్తి ఆలయ బోర్డు సభ్యుడు మహేందర్‌రెడ్డి, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కళాకారులు సుబ్రమణ్యంరెడ్డి, విజయకుమార్, మురళి, ఘంటసాల అభిమానులు పాల్గొన్నారు. ఘంటసాల 101వ జయంతి సందర్భంగా తిరుపతిలోని గాన కళాపీఠం అధ్యక్షుడు మల్లం విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఘంటసాల విగ్రహానికి సోమవారం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఆర్సీపురంలో గాలీవాన బీభత్సం





రాయలచెరువు వద్ద నేలకొరిగిన చెట్టు, ఆర్‌సీపురంలో నేలకొరిగిన చెట్టు

రామచంద్రాపురం: మిచాంగ్ తుపాను నేపథ్యంలో సోమవారం మండల వ్యాప్తంగా హోరుగాలితో కూడిన భారీవర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో అక్కడక్కడా చెట్లు నేలకొరిగాయి. మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై భారీ వృక్షం కూలిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రాయలచెరువు కట్టపై మరో వృక్షం పడిపోవడంతో స్థానికులు అక్కడి నుంచి తొలగించారు. దీంతో రాకపోకలు సజావుగా సాగాయి. అనుప్పల్లి వద్ద ఉన్న పెద్దేటి వంక నుంచి నీరు ఉధృతంగా రావడంతో రాయలచెరువులో నీటిమట్టం రెండు అడుగుల మేర పెరిగింది. తహశీల్దార్ చిన్నవెంటేశ్వర్లు రాయలచెరువు, పీవీపురం ఎస్టీకాలనీలకు వెళ్లి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నా సంబంధిత సచివాలయాలను సంప్రదించాలన్నారు. మండల వ్యాప్తంగా 51.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు చెప్పారు.

భారీ వర్షం... పెను గాలులు

భాకరాపేట: ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాల్లో పెను గాలులు, భారీ వర్షం కురుస్తోంది. సోమవారం ఉదయం నుండి భారీగా గాలులు వీచాయి. సాయంత్రం 4 గంటల నుండి భారీగా వర్షం కురిసింది. ఎర్రావారిపాళెం మండలంలో అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు చెరువులకు నీరు చేరుతోంది. తలకోన జలపాతం నుండి వచ్చే వర్షపు నీటితో ఆలయం ముందు వెళుతున్న వంక భారీగా ప్రవహిస్తోంది. చిన్నగొట్టిగల్లు మండలంలో వర్షం కంటే గాలులు పెద్ద ఎత్తున వీస్తున్నాయి.